క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం నార్త్‌లోని ఇంజేటివారిపేటలో శ్రీ గొంతేనమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీ వాణి ట్రస్ట్, సమరసత సేవా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. శుక్రవారం ఆలయ అర్చకులు కోసూరి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలోపాలపర్తి శ్రీనివాస్, నేతల నర్సింహరావు, పాలపర్తి నాగరాజు దంపతులచే సామూహిక పూజలు నిర్వహించారు. మండల సంయోజకులు కటికల బాలాజీ, సహాయ సంయోజకులు ఆముదాలపల్లి రాంబాబు, నేదునూరి శ్రీనివాస్ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. వినుకొండ రాంబాబు, ఆముదాలపల్లి వీర బ్రహ్మం సిద్ధాంతి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సేవా సమితి పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: మండల ప్రజా పరిషత్ పెదగరువు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాలలో అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిల్లా సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలతో పాటు ఇటువంటి సేవా సంస్థల సహాయం వలన విద్యార్థులకు మరింత మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి సభ్యులు నేతల రాఘవరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుర్గమ్మ భూమి లీజు వేలం వాయిదా


వేలం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పెనుమంట్ర: గ్రామంలో వేంచేసియున్న కనక దుర్గమ్మ ఆలయ భూముల లీజు వేలం వాయిదా వేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఆలయానికి చెందిన 4.80 ఎకరాల పంట భూమిని లీజు వేలం శుక్రవారం నిర్వహించాల్సి ఉండగా వేలంలో పాల్గొనేందుకు రైతులు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఇది ఇలా ఉండగా ఈ వేలంకు సంబంధించి అధికారులు ప్రకటనతో కూడిన ఫ్లెక్సీని ఆలయ ఆవరణలో ప్రదర్శనకు పెట్టారు. అందులో మాత్రం ఈ నెల 28న ఉదయం 2 గంటలకు ఆలయం వద్ద వేలం నిర్వహించబడునని ఆ ప్రకటనలో పేర్కొనడం హాస్యాస్పదంగా ఉంది. తదుపరి వేలం ఎప్పుడు నిర్వహించే తేదీ తెలియజేస్తామని ఈవో వివరణ ఇచ్చారు.

నేడు గీతామందిరంలో రంగస్థల కళాకారుల సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మండల రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 145వ నెలవారి సభా కార్యక్రమం ఈ నెల 30వ తేదీ ఆదివారం సాయంత్రం గీతా మందిరంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీ కృష్ణ, కోశాధికారి తగరంపూడి మురళీకృష్ణలు తెలిపారు. పెదవెల్లమిల్లికి చెందిన వాస్తు పండితులు దండమూడి సత్యనారాయణకు గౌరవ సత్కారం, భీమవరంనకు చెందిన సాయి ఘంటసాల ఆర్కెస్ట్రా నిర్వాహకులు తమిరి సాంబమూర్తికి కళా సత్కారం, కొమ్ముగూడెం వ్యాయమ ఉపాధ్యాయులు కొత్త సుభద్రకు ఉద్యోగ సేవా పురస్కారం, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సీనియర్ భజన కళాకారుడు ఇసరపు అబ్బులుకు ఆర్థిక సత్కారం అందజేస్తామని తెలిపారు. కళాకారులచే ఆపాద మధురాలు పేరుతో సినీ సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు. కళాకారులు, సాహితి ప్రముఖులు, పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

తణుకు టౌన్: వినియోగదారుల హక్కులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల సంఘం చైర్మన్ జీఎస్ఆర్ శంకర్ చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వినియోగదారుల క్లబ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శంకర్ మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యార్థులు వినియోగదారుల హక్కులను గుర్తించి వాటి పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

ప్రధాన కాలువను ప్రక్షాళన చేయాలి

మొగల్తూరు: మొగల్తూరు ప్రధాన కాలువ అధ్వానంగా తయారయ్యింది. దీంతో స్థానికులు వెంటనే ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు. నిడదవోలు-నరసాపురం ప్రధాన కాలువ మొగల్తూరు వరకు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే జంతు కళేబరాలు, చెత్త చెదారారం అన్నీ మొగల్తూరు వరకు వచ్చి నిలిచిపోతాయి. ముఖ్యంగా మొగల్తూరులోని కడలివారిపాలెం నుంచి మొగల్తూరు లాకు వరకు పెద్ద ఎత్తున చెత్త చెదారాలు, గుర్రపుడెక్క నిలిచి, నీటి ప్రవాహం ముందుకు సాగదు. ఎండి పోయిన గుర్రపు డెక్క ఎక్కువ రోజులు కాలువ నీటిలో ఉండిపోవడంతో నీరు నల్లగా మారి, స్థానికులు ఈ కాలువ నీటిని వినియోగించడం లేదు. మొగల్తూరు ప్రధాన కాలువ వేలాది ఎకరాలకు సాగు నీరు అందించడంతో పాటు సుమారు 8 గ్రామాల ప్రజలకు తాగు నీటి అవసరాలు తీరుస్తుంది.


ప్రధాన కాలువలో జంగిల్ ఛానల్ వద్ద పేరుకుపోయిన చెత్త


మొగల్తూరు లాకు వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క

మొగల్తూరు కాలువ నుంచి కేపీపాలెంలో భారీ మంచి నీటి చెరువును నింపి, కేపీపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం సౌత్, నార్త్, ముత్యాలపల్లి, మోడి, వారతిప్ప, కొత్తకాయల తిప్ప గ్రామాలకు తాగు నీరు సరఫరా చేస్తారు. అలాగే మొగల్తూరులోని మంచి నీటి చెరువును నింపి మొగల్తూరు, రామన్నపాలెం, శేరేపాలెం గ్రామాలకు తాగు నీటిని అందిస్తారు. అయితే కాలువ నీరు అధ్వానంగా మారి, దుర్వాసన రావడంతో తాగు నీటి చెరువులను నింపడం లేదు. కాలువలో నిలిచిపోయి, ఎండి పోయిన గుర్రపు డెక్క, చెత్త చెదారాలను తీసివేయాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నత లక్ష్యాలతో చదవాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీవో అచ్యుత్ అంబరీష్

నరసాపురం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి, విజయాలు సాధించాలని నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ సూచించారు. శుక్రవారం శ్రీ సూర్యా కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో అంబరీష్ మాట్లాడుతూ మంచి లక్ష్యంతో కష్టపడితే ప్రయోజనం ఉంటుందన్నారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో 400 పైగా మార్కు లు సాధించిన 90 మంది విద్యార్థులను అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, అకడమిక్ అడ్వైజర్ బి.రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

చక్ర చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు


విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పోడూరు: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవడమే లక్ష్యంగా చదువులో ముందుకు సాగాలని ప్రముఖ రైస్‌మిల్లర్ పెన్మెత్స రామచంద్రరాజు పిలుపునిచ్చారు. చక్ర ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పీఎల్ రాజు 97వ జయంతి పురస్కరించుకొని ఆయన కుమారులు పెన్మెత్స రాజగోపాలరాజు (గోపి), పెన్మెత్స వెంకటపతిరాజు (వర్మ) జిన్నూరులోని ఏఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమస్థానాల్లో నిలిచిన ఇద్దరు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. బాలికల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన దొంగ హారికకు రూ.10 వేలు, బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన దొమ్మేటి లీలా మణికంఠకు రూ.10 వేలు నగదు బహుమతులతో పాటు హైస్కూల్‌కు రూ.20వేల విలువైన సౌండ్ సిస్టంను పీఎల్ రాజు కుటుంబసభ్యులు, పారిశ్రామికవేత్త పెన్మెత్స రామచంద్రరాజు, పెన్మెత్స సుబ్బరాజు, ట్రస్ట్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రరాజు మాట్లాడుతూ పీఎల్‌రాజు పారిశ్రామికవేత్తగా ఉన్నత శిఖరాలను అందుకుని చక్ర ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు, పేద రోగులకు అండగా నిలిచేలా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. హైస్కూలు హెచ్‌ఎం సీహెచ్.శివజ్యోతి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయడంతోపాటు హైస్కూల్‌కు సౌండ్‌సిస్టం బహూకరించిన సందర్భంగా పీఎల్ రాజు కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ఏరియా కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, పెన్మెత్స సుబ్బరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డుల్లోకి వెళ్లి అభివృద్ధి చూడండి

జనసేన సభ్యుల ప్రశ్నకు చైర్‌పర్సన్ సమాధానం


చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశం వాదోపవాదాలతో రసాభాసగా మారింది. సమావేశంలో పట్టణంలో అభివృద్ధి లేదని జనసేన సభ్యులు వాదించడంతో చైర్‌పర్సన్ విభేదించారు. వార్డుల్లోకి వెళ్లి జరిగిన అభివృద్ధిని చూడాలన్నారు. కౌన్సిల్ ఏర్పడ్డాక వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి వివరించారు. ప్రతిపక్ష వార్డులనే వివక్ష లేకుండా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేశామని వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని అన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ కలిసికట్టుగా పని చేసి మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని సూచించారు. ఎమ్మెల్యే తొలిసారి వస్తుండగా కనీసం స్వాగత ఫ్లెక్సీ ఏర్పాటు చేయలేదని జనసేన సభ్యులు వాదనకు దిగారు. చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ వివరణ ఇస్తూ ఎమ్మెల్యే వస్తున్నారనే సమాచారం తనకు లేదన్నారు. ప్రజా ప్రతినిధుల ను అగౌరపరిచే సంస్కారం వైఎస్సార్‌సీపీకి లేదన్నారు.


కౌన్సిల్ సమావేశంలో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

సమస్యలపై ధ్వజం:

వార్డుల్లో పారిశుద్ధ్యం క్షీణిస్తోందని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వన్నెంరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. పట్టణంలో డ్రెయినేజీల్లో తీసిన సిల్ట్‌ను ఓ షాపులో వేశారని, శానిటరీ అధికారులకు ఇది తగదని వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని ధ్వజమెత్తారు. టౌన్ ప్లానింగ్ అధికారుల ప్రోద్బలంతో అక్రమ భవన నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని కేసరి గంగరాజు ఆరోపించారు. పలు సమస్యలపై కౌన్సిలర్లు ప్రశ్నించారు.

ఐపీసీ చర్చిలో ఉచిత వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

పోడూరు: ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ చూపాలని న్యూ లైఫ్ మినిస్ట్రీస్ డైరెక్టర్, పండితవిల్లూరు ఐపీసీ చర్చి పాస్టర్ జి.సామ్యేల్ జాన్సన్ అన్నారు. న్యూలైఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, వైద్య కళాశాల వారిచే పండితవిల్లూరు ఐపీసీ చర్చిలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండితవిల్లూరు కేంద్రంగా న్యూలైఫ్ మినిస్ట్రీస్, ఐపీసీ చర్చి ద్వారా గత 30 ఏళ్లుగా ఆధ్యాత్మిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు కార్డియాలజీ, ఊపిరితిత్తులు, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, క్షయ, స్త్రీల విభాగానికి సంబంధించి వ్యాధులతో ఉన్న రోగులు 250 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి వెళ్లే రోగులకు శనివారం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి పీఆర్‌ఓ సురేష్ తెలిపారు. వైద్యులు వైఎస్.సాయికృష్ణ, బి.అమృత, డి.వెంకట్, ఎ.భార్గవ్, పావని ప్రియ శిబిరంలో సేవలందించారు. ఐపీసీ పాస్టర్ జి.సామ్యేల్ మోర్స్, సదమల్ల మేరీ శాంతి, రవికుమార్, చవ్వాకుల భరత్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ప్రయోజనాలెన్నో

తాడేపల్లిగూడెం: పాలిటెక్నిక్ చదువుతో ప్రయోజనాలెన్నో ఉన్నాయని వాసవీ పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి ఏడాది తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి తర్వాత విద్యార్థులు ఇంటర్మీడియట్ చదవాలా, పాలిటెక్నిక్ చదవాలా అనే సందిగ్ధంలో ఉంటారని, ఇంజనీరింగ్ పట్ల ఆసక్తి ఉన్నవారు పాలిటెక్నిక్‌ను ఎంచుకుంటే మంచి ఫలితాలతో పాటు చక్కని భవిష్యత్‌ను సాధించడానికి అవకాశం ఉందన్నారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడం వల్ల ఇంజనీరింగ్ సబ్జెక్టుల్లో పట్టును సాధించి పారిశ్రామిక రంగ అవసరాలకు ఉపయోగపడే విధంగా కోర్సు పూర్తి చేసి ఉద్యోగం సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యులు

పాలకొల్లు అర్బన్: ఎర్ర రక్త కణాలు తగ్గిపోవడం అనేది వారసత్వంగా వచ్చే వ్యాధి లక్షణమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. పాలకొల్లు మండలం కాపవరంలో శుక్రవారం సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఎర్ర రక్త కణాలు గుండ్రంగా ఉంటాయని, కానీ సికిల్ సెల్ ఎనీమియా సోకిన వారి శరీరంలో అర్ధ చంద్రాకారంలో ఉంటాయన్నారు. ఇవి ఆక్సిజన్ సరఫరాకు ఆటంకం కలిగిస్తాయన్నారు. ఈ కణాలు తల్లిదండ్రుల నుంచి వంశ పారంపర్యంగా వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ కారణంగానే మేనరికపు వివాహాలు చేసుకోకూడదన్నారు. గిరిజన ప్రాంతాల్లో వారికి ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుందని డాక్టర్ ప్రతాప్‌కుమార్ వివరించారు. వ్యాధి కారణంగా ఎర్ర రక్త కణాలు తగ్గిపోవడం, రక్తహీనత ఏర్పడడం, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడం ఇబ్బంది, అలసట, అంగవైకల్యం కలగడం వంటి లక్షణాలు బయట పడతాయన్నారు. ఈ లక్షణాలు గలవారు తక్షణమే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎలిజబెత్, డి.కమల, ఎస్కే అమలేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో డి.సుహాసిని

పోడూరు: మండల పరిధిలో అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు ఇంటింటికీ ప్రభుత్వ పింఛన్లు పంపిణీ చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో డి.సుహాసిని తెలిపారు. స్థానిక ఎంపీడీ కార్యాలయంలో శుక్రవారం ఆమె పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఏఎస్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో 16 గ్రామాల్లో 299 క్లస్టర్లలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, ఇతర ప్రభుత్వోద్యోగులచే లబ్ధిదారులకు ఇంటింటికీ ప్రభుత్వ పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలనీ, నివాస ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో సుహాసిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎం.బలరామరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఏఎస్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం డిగ్రీ కాలేజీలో పీజీ కోర్సు

గణపవరం: గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈవిద్యా సంవత్సరం నుంచి పీజీ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి తెలిపారు. ఈమేరకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చిందన్నారు. 2024-25 లో తమ కాలేజీలో ఎంకాం కోర్సు ప్రారంభించేందుకు అనుమతి వచ్చిందన్నారు. డిగ్రీ పాసై, ఏపీపీజీ సెట్‌లో అర్హత సాధించిన వారు ఎంకాం కోర్సులో ప్రవేశానికి అర్హులని తెలిపారు.ఈ అవకాశాన్ని గణపవరం పరిసర గ్రామాల విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. పూర్తిగా గ్రామీణ ప్రాంతాలైన గణపవరం, నిడమర్రు, ఆకివీడు, ఉంగుటూరు, అత్తిలి మండలాల్లోని విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నామని ఆమె చెప్పారు. తమ కాలేజీలో పీజీ కోర్సుకు అనుమతి ఇచ్చిన ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎంఈవో శుభాకరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శుభాకరరావు

పెనుగొండ: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో డి.శుభాకరరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పెనుగొండ ఎంఈవో కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు అడిగిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందించాలన్నారు. విద్యా హక్కు చట్టం (12)1సీ నిబంధన ప్రకారం పాఠశాలలకు కేటాయించిన విద్యార్థులను తప్పనిసరిగా చేర్చుకోవాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాలల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


సైకిల్ అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతిభ కలిగి పేదరికంతో ఉన్నత విద్యకు వెళ్లలేని వారికి దాతలు స్వచ్ఛంద సంస్థలు చేయూతనందివ్వడం గొప్ప విశేషమని భీమవరం వన్ టౌన్ ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వెంకట్రామ థియేటర్ వద్ద పేద విద్యార్థికి దాతల సహకారంతో నూతన సైకిల్, నోట్ పుస్తకాలు విద్యా సామాగ్రి అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దాతల సహకారంతో చదివిన విద్యార్థులెందరో ఉన్నత స్థాయిలో ఉన్నారని, ఇటువంటి వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్న దాతలు సేవలు అద్వితీయమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం ఏఆర్ కేఆర్ మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న సిహెచ్ నరేంద్రకుమార్ కు పట్టణానికి చెందిన వంగలపూడి రాధాకుమారి సహకారంతో నూతన సైకిల్, నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశామని అన్నారు. అనంతరం రాధకుమారి పుట్టినరోజు సందర్భంగా ప్రేమాలయంలోని వృద్ధులకు భోజనాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత వంగలపూడి రాధకుమారి, లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, అరసవల్లి సుబ్రమణ్యం, షేహనాజ్, పులపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలు నిలుపుదల చేయాలి

తణుకు అర్బన్: పౌర హక్కులకు భంగం కలిగించే కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తణుకు బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఆల్ ఇండియా లాయర్స్ ఆధ్వర్యంలో జూలై 1వ తేదీ నుంచి అమలు కాబోతున్న కొత్త క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులు తమ నిరసన తెలిపారు. కొత్త చట్టంలో పౌర హక్కుల స్వేచ్ఛకు, న్యాయవ్యవస్థ స్వతంతతను తగ్గించే విధంగా రూపొందించారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఏ వ్యక్తికి కూడా సంకెళ్లు వేయరాదని అతని స్వేచ్ఛకు భంగం కలిగించరాదని తీర్పులు ఇవ్వగా నేడు కొత్త చట్టం ప్రకారం చేతులకు బేడీలు వేసే విధంగా ఉందని, న్యాయవ్యవస్థకు ఉన్న అధికారాలను తగ్గించి, పోలీసు అధికారులు, ఎగ్జిక్యూటివ్ అధికారులకు జ్యుడీషియల్ అధికారాలను కట్టబెట్టే విధంగా కొత్త చట్టాన్ని మార్పు చేశారని విమర్శించారు. ఈ చట్టాలు కేవలం రాజకీయ నాయకులకు అనుగుణంగా ఎగ్జిక్యూటివ్ అధికారులు పనులు చేయుటకు అమలు చేసిన చట్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎ.దుర్గాప్రశాంతి, కామన మునిస్వామి, చింతపల్లి నాగేశ్వరరావు, నీలం హరీష్‌నాయుడు, జి.అంబేద్కర్, ఎస్.సోమేశ్వరరావు, ఎస్కే బాజీ, పి.ప్రతాప్‌కుమార్, ఎస్.సాంసన్ పాల్గొన్నారు.

ఔషధాల గని.. నేరేడు

- మార్కెట్లో పుష్కలంగా అల్ల నేరేడు పళ్లు
- కనుమరుగవుతున్న నాటు కాయలు

పాలకొల్లు సెంట్రల్: నేరేడు పండులో ఔషధ గుణాలు మెండుగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పట్టణంలో ఎక్కడ చూసినా అల్ల నేరేడి పళ్ల దర్శనమిస్తున్నాయి. పట్టణ ప్రధాన కూడళ్లు, చిన్న చిన్న వీధుల్లో కూడా విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. కేజీ రూ.150 నుంచి 200 వరకూ విక్రయిస్తున్నారు. ఈ నేరేడి పళ్ల రాజమండ్రి నుంచి వస్తున్నాయి. హోల్‌సేల్ వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన రిటైల్ వ్యాపారులు వాటిని గ్రేడ్‌ల వారీగా విభజించి విక్రయిస్తుంటారు. స్థానిక చిరు వ్యాపారులు గ్రేడ్‌ల వారీగా విభజించి అమ్మకాలు చేస్తుంటారు. వీటిని గతంలో బుట్టల్లో సప్‌లై చేసేవారు. ప్రస్తుతం ఎక్కువగా ట్రేలలో సప్‌లై చేస్తున్నారు. ఒక్కో ట్రేలో 30 కిలోలు వరకూ సరుకు నింపుతుంటారు. గతంలో మార్కెట్లో నేరేడు పళ్ల నాటు కాయలు వచ్చేవి. నేడు నాటు కాయలు మార్కెట్లో మచ్చుకు కూడా కనిపించడం లేదనే చెప్పాలి. అక్కడక్కడా సైకిళ్లపై మొగల్తూరు, పేరుపాలెం, సీతారామపురం వంటి ప్రాంతాల నుంచి వచ్చి పట్టణాల్లో నేరేడు పళ్ల నాటు కాయలను విక్రయించేవారు. నేడు వాటి విక్రయాలు తక్కువగా ఉండడంతో అల్ల నేరేడు పళ్లనే మార్కెట్లో ఎక్కువగా విక్రయిస్తున్నారు.

నేరేడు పండ్లతో ఆరోగ్యానికి మేలు

రోగ్యానికి మేలు చేసే వాటిలో నేరేడు పళ్ల ఒకటి. ఇవి తినడం వల్ల మధుమేహం, బీపీ ఉన్న వారికి సంజీవనిలా ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు. నేరేడు పళ్ల రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు పోషకాలను అందిస్తాయి. నేరేడు పళ్లను ఆయుర్వేదంలో అపర సంజీవనిగా పిలుస్తారు. వీటిలో విటమిన్ ఏ, సీ అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని పెంచడంతో పాటు ఆకలి కూడా పుట్టిస్తుంది. ఏదైనా కారణం వల్ల కడుపులోకి వెంట్రుకలు వెళితే నేరేడు పళ్ల తింటే అవి నశించిపోతాయని పూర్వీకులు చెబుతున్నారు.


మార్కెట్లో అమ్మకానికి ఉంచిన అల్ల నేరేడు పళ్లు

విక్రయాలు జోరుగా సాగుతున్నాయి



నాటు కాయలు మార్కెట్లోకి పెద్దగా రావడం లేదు. గత కొన్నేళ్లుగా అల్ల నేరేడి పళ్లనే విక్రయిస్తున్నాము. రాజమండ్రి వద్ద రాజానగరం నుంచి ఎక్కువగా కొనుగోలు చేస్తుంటాము. హోల్‌సేల్ ధర కిలో రూ.60 నుంచి రూ.100 వరకూ కొనుగోలు చేస్తుంటారు. వాటిని గ్రేడ్ చేసుకుని నలిగిన కాయలు తొలగించి మంచి కాయలు విక్రయించే సరికి పావు కిలో రూ.40 లేదా రూ.60 వరకూ గిట్టుబాటవుతుంది. ట్రే 30 కేజీల వరకూ లెక్కించి కొంటుంటాము. ప్రస్తుతం నేరేడు పళ్ల సీజన్ కొనసాగుతోంది. జనం ఆరోగ్య రీత్యా ఎక్కువగా నేరేడు పండ్లకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

ఏ.దుర్గారావు, పండ్ల వ్యాపారి, పాలకొల్లు